కామ్రేడ్ మాకిరెడ్డి సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర - నర్సీపట్నం: నర్సీపట్నం మండలం గబ్బాడ గ్రామంలో కామ్రేడ్ వై.మాకిరెడ్డి సంస్మరణ సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సీపీఐ సిద్ధాంతాలకు కట్టుబడి ఎన్నో భూ పోరాటాలు చేసి, బడుగు, బలహీన వర్గాల కోసం శ్రమించి ఉద్యమాలలో పాల్గొని కొంతకాలం పార్టీకి దూరంగా ఉండి కమ్యూనిస్టుల ఎర్రజెండా భావజాలం తో కొన ఊపిరి వరకు పనిచేసిన యోధుడు మాకిరెడ్డి అన్నారు. ఆయన ఎటువంటి హంగు ఆర్భాటాలు లేకుండా సాధారణ మనిషిగా చివరి క్షణం వరకు ప్రజల ఉద్యమాలతో మమేకమై జీవించారన్నారు. కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం సీనియర్ నాయకులు, సమాచార హక్కు ప్రచార ఐక్యవేదిక సీనియర్ నాయకులు రావు జగ్గారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, జిల్లా సహాయ

కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, కన్నబాబు, దేముడు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గంగా భవాని, ఎల్.గౌరీ, మేకా సత్యనారాయణ, సాపిరెడ్డి, రాజు నూకి నాయుడు, గురుబాబు తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్ హత్య

పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు...?

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: మండలంలోని ఊడేరు సమీపంలో రౌడీ షీటర్ హత్యకు గురైన సంఘటన జిల్లాలో సంచలనం కలిగించింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రౌడీ షీటర్ రాజన కన్నబాబు అలియాస్ పంతులు ఉమ్మడి విశాఖ జిల్లాలో దాదాపు 14 కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. విశాఖ నుంచి కన్నబాబును నగర బహిష్కరణ కూడా చేసినట్లు తెలిసింది. పెందుర్తి పోలీస్ స్టేషన్లో ఉన్న రౌడీ షీట్ అనకాపల్లి అనకాపల్లి రూరల్‌కు బదిలీ చేసినట్లు సమాచారం. ఇలా ఉండగా కన్నబాబు గత కొద్ది రోజులుగా తన తల్లితో కలిసి గాంధీ నగర్ లో ఉంటున్నాడు. ప్రాంతం మారిన, పోలీస్ స్టేషన్ మారిన తన సెటిల్మెంట్ వ్యవహారాలను కొనసాగిస్తూ ఉంటున్నాడని తెలిసింది.

అదే క్రమంలో ఊడేరు సమీపంలో సెటిల్మెంట్ వ్యవహారం బెడిసి కొట్టి సమీప వ్యక్తులు మందు బాటిల్స్‌తో రౌడీ షీటర్ కన్నబాబును కొట్టి చంపినట్లు ప్రజలు గుసగుస లాడుకుంటున్నారు. ఇదిలా ఉండగా రౌడీ షీటర్ మర్డర్ వ్యవహారంలో ప్రమేయం ఉన్న ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. మర్డర్ సంబంధించి పోలీసులు ఇప్పటివరకు వివరాలను వెల్లడించలేదు..

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

కమిషనర్ సి.ఎం.సాయి కాంత్ వర్మ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వాతావరణ మార్పు వలన సాధారణంగా సీజనల్ వ్యాధుల వ్యాప్తితో పాటు దోమలు వృద్ధి చెందుతాయని, వాటి నివారణకు కృషి చేయాలన్నారు.

ముఖ్యంగా దోమలు వృద్ధి చెందకుండా నీటి నిల్వలేకుండా చర్యలు చేపట్టాలని, పూల కుండీలు నీటి తొట్టిలోని నీరు, కొబ్బరి బోండాలు, ఖాళీ సీసాలు, ఫ్రిజ్ వెనక భాగాన నీరు నిల్వ లేకుండా చూడాలని, దోమ తెరలు ఉపయోగించాలని, పరిసరాలు పొడిగా ఉండే విధంగా చూడాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని ప్రజలకు సూచించారు. దోమల నివారణకు కాలువలలో దోమల నివారణ మందు పిచికారి చేయడంతో పాటు ఫాగింగ్ చేయాలని ఈ ఏడాది డెంగ్యూ కేసుల నమోదు శాతం ఉండరాదని తెలిపారు.

మహిళా ఎస్సైని సస్పెండ్ చేయాలి

దళిత సంఘాల డిమాండ్

విశాలాంధ్ర - విశాఖ : జ్ఞానానంద స్వామిజీ ఆశ్రమం వద్ద బుధవారం మహిళా, విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలో మహిళా సంఘం నేత, దళిత మహిళ వనజాక్షిపై చేయిచేసుకున్న ఎంవీపీ పోలీస్ స్టేషన్ ఎస్ఐ దివ్యజ్యోతిని సస్పెండ్ చేయాలని దళిత సంఘాల నేతలు డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల నేతలు బాధితురాలు వనజాక్షి తో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ స్వామీజీ పై చర్యలు చేపట్టాలని, బాధిత బాలికకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న నాయకులు, మహిళా సంఘాల నేతల పట్ల దురుసుగా ప్రవర్తించి దాడికి పాల్పడ్డారని అన్నారు. సాటి మహిళా అధికారిగా బాధిత బాలిక పక్షాన నిలబడి న్యాయం చేయాల్సిన అధికారి స్వామీజీకి వత్తాసు పలకడం దుర్మార్గపు చర్యగా పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలను ప్రోత్సహిస్తున్న వారు ప్రజా సేవలో ఉండడానికి వీలు లేదని ఆక్షేపించారు. బాధిత వనజాక్షి దళిత మహిళ అని, దాడికి పాల్పడ్డ ఎస్ ఐ దివ్యజ్యోతి పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు జి రాంబాబు, కొత్తపల్లి వెంకటరమణ, నాగరాజు, బాధిత మహిళ వనజాక్షి, దేవుడమ్మ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

భీమిలి క్రాస్ రోడ్ హైవే స్థలాలను కారుచౌకగా కొట్టేస్తున్న ఆక్రమణదారులు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం నుండి విశాఖ వెళ్లే ఎన్‌ఎచ్-5 రోడ్ భీమిలి క్రాస్ రోడ్ జంక్షన్ దగ్గర హైవేకి ఇరువైపులా ఉన్న ఆర్అండ్‌బీ స్థలాలను కొంతమంది రాజకీయ పలుకుబడి ఉన్న వాళ్ళు ఆక్రమించి వ్యాపారులకు ఒక్కో స్థలాన్ని 4 నుండి 6 లక్షలు వరకు కారుచౌకగా అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే ఇక్కడ రోడ్‌కి ఇరువైపులా ప్రభుత్వ స్థలంలో హోటల్స్ వెలిశాయి. ఇంకొందరు ఆధునిక కాఫీ స్టాల్‌లు, నర్సరీ లు పెట్టారు. ముందుగానే ఆక్రమణదారులు ప్రణాళిక ప్రకారం రోడ్‌కి ఇరువైపులా ఉన్న గెడ్డలను మట్టితో పూడ్చి రోడ్ లెవల్‌కు స్థలాలను చదును చేసి ఉంచారు. దీంతో వ్యాపారులు తమ వ్యాపారాల కోసం ఆక్రమణదారులను సంప్రదించి రేట్ మాట్లాడుకుని ప్రభుత్వ స్థలాలను పొందుతున్నారు. ఇదంతా హైవే పక్కనే జరుగుతున్నా రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులు ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. అధికారులతో కుమ్మక్కయ్యే ఈ వ్యవహారం నడుస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. హైవేకి రాత్రివేళ వేస్ట్ మట్టితో గెడ్డలను కప్పేసి రాత్రికి రాత్రే షెడ్ నిర్మాణాలు చేస్తున్నారు. కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టి గెడ్డలు కప్పేయడం వల్ల వర్షపు నీరు పోయేదారి లేక రోడ్లపైకి వస్తుంది. హైవే స్థలాలు అన్యాక్రాంతం జరిగి కోట్లు విలువైన స్థలాలును కారు చౌకగా కొట్టేస్తున్నారు. అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజాస్వామ్యంలో ప్రశ్నిస్తే దాడులా....!

ఎస్ఐ దివ్యజ్యోతిని సస్పెండ్ చేయాలి
ఏపీ మహిళా సమాఖ్య విశాఖ జిల్లా అధ్యక్షురాలు ఎం.ఏ భేగం

విశాలాంధ్ర - పెందుర్తి: ప్రజాస్వామ్యంలో ప్రశ్నిస్తే దాడులు చేస్తారా అని ఏపీ మహిళా సమాఖ్య విశాఖ జిల్లా అధ్యక్షురాలు ఎం.ఏ భేగం ప్రశ్నించారు. విశాఖలోని వేంకోజీపాలెం జ్ఞానానంద ఆశ్రమంలో మైనర్ బాలికలపై అత్యాచారం చేసిన పూర్ణానంద స్వామిజీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మహిళా సమాఖ్య, యువజన, విద్యార్థి నాయకులు ఆందోళన చేస్తుంటే జిల్లా మహిళా సమాఖ్య నాయకురాలు వనజాక్షిపై ఎస్ఐ దివ్య జ్యోతి దురుసుగా ప్రవర్తించి కొట్టడాన్ని నిరసిస్తూ జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్ కూడలిలో గురువారం ఉదయం మహిళా సంఘాలు పెద్దఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టాయి. ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎస్సై దివ్యజ్యోతిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మహిళ సమాఖ్య పెందుర్తి ఏరియా కార్యదర్శి అంపావల్లి అన్నపూర్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎం.ఏ.బేగం ముఖ్యఅతిథిగా పాల్గొని పోలీసుల తీరును ఖండించారు. రౌడీలు, గూండాలు చెలరేగిపోతున్నా పట్టించుకోని పోలీసులు ప్రజాసమస్యలపై పోరాడే మహిళలపై దాడులు చేయడం దారుణమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎన్.నారాయణ, కక్కల రజిని, అనురాధ, రామ లక్ష్మి పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి గిరి ప్రదక్షిణ ఏర్పాట్లను ఇన్‌చార్జ్ ఈఓ భ్రమరాంబ, ఈఈ శ్రీనివాసరాజు, రాంబాబుల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.మల్లిఖార్జున, పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, జి.వి.ఎం.సి కమిషనర్ శ్రీకాంత్ వర్మ గురువారం పరిశీలించారు. స్వామివారి రథం సింహాచలం కొండక్రింద తొలిపావంచా నుండి పాత అడవివరం నుండి కృష్ణాపురం గోశాల మీదుగా సెంట్రల్ జైలు , ముడసర్లలోవ, ఆరిలోవ జంక్షన్ ,హనుమంతువాక జంక్షన్, విశాలాక్షినగర్, జోడుగుల్ల పాలెం, తెన్నేటిపార్కు, ఎం.వి.పి లుంబిని పార్క్, ఎం.వి.పి డబల్ రోడ్, టిటిడి జంక్షన్, ఇసుకతోట జంక్షన్ మీదుగా మద్దిలపాలెం, సత్యం జంక్షన్, గురుద్వారా జంక్షన్, అక్కయ్యపాలెం

జంక్షన్, తాటిచెట్లపాలెం హైవే , కంచరపాలెం హైవే, బిర్లా జంక్షన్ , ఎన్. ఏ. డి జంక్షన్, గోపాలపట్నం పెట్రోల్ బంక్, ప్రహల్లాదపురం, పాతగోశాల మీదుగా తొలిపావంచాను చేరుకునే మార్గం అని ఇఓ జిల్లా అధికార బృందానికి తెలియజేశారు. గిరి ప్రదక్షిణ చేసే భక్తుల సౌకర్యార్థం ఆయా ప్రాంతాల్లో మంచినీరు, అల్పాహారం, మరుగుదొడ్లు, ప్రథమ చికిత్స కేంద్రాలు, ప్రత్యేక పోలీస్ నిఘా ఏర్పాట్లన్నీ చూసుకోవాలని అధికారులు నిర్ణయించుకున్నారు.

ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించండి

విశాలాంధ్ర - నక్కపల్లి: నక్కపల్లి 50 పడకల ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు కల్పిం చాలని ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరక్టర్ వీసం రామకృష్ణ జిల్లా డిసిహెచ్ డాక్టర్ రమేష్‌ను కోరారు. ఈ మేరకు గురువారం నక్కపల్లి 50 పడకల ఆసుపత్రిని జిల్లా డిసిహెచ్ డాక్టర్ రమేష్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా వైద్యం కోసం వచ్చిన రోగులకు సకాలంలో వైద్యం అందించాలని ఆసుపత్రి సిబ్బంది సూచించారు. మందుల నిల్వలపై వివరాలను అడిగితెలుసు కున్నారు. వైద్య అధికారుల సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఈ సందర్భంగా ఏపి పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ నక్కపల్లి 50 పడకల ఆసుపత్రి వద్ద కలిసి డిసిహెచ్ డాక్టర్ రమేష్ వైద్యం కోసం వచ్చేవారికి మెరుగైన సేవలు అందించాలని, ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి 50 పడకల ఆసుపత్రి సూపరింటెండ్, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, వైఎస్ ఎంపిపి వీసం నానాజీ, జెడ్‌పిటిసి గోసల కాసులమ్మ, కొప్పిశెట్టి హరి తదితరులు ఉన్నారు.

ఆసుపత్రిలో సేవల పట్ల కలెక్టర్ సంతృప్తి

విశాలాంధ్ర - కశింకోట: తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలు పట్ల జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని తాళ్లపాలెం ప్రాథమిక కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. అక్కడ రోగులకు అందుతున్న సేవలు నేరుగా పరిశీలించారు. ఆసుపత్రిలో లెబ్, ఓపి, ఆపరేషన్ థియేటర్, రోగులు ఉండే గది, మెడికిల్ స్టోర్ రూమ్ పరిశీలించారు. 130 రకాల మందులు అందు బాటులో ఉండటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామల వారిగా ఎన్.సీ.డీ సీడీ సర్వే వివరాలు అడిగి తెలుసుకుని, ఆన్‌లైన్లో పరిశీలించారు. 85 శాతం పూర్తి చేయడం పట్ల డాక్టర్ రమేష్, సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్.సీ.డీ సీడీ సర్వే జిల్లా వ్యాప్తంగా నూటికి నూరు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి ఆదేశించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో హేమంత్, అడిషనల్ డీఎంహెచ్ జ్యోతి, మండల ప్రత్యేక అధికారి రోజా రాణీ, ఎంపీడీఓ రవి కుమార్, తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యువత మంచి మార్గంలో పయనించాలి

విశాలాంధ్ర - కె.కోట పాడు: యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, మంచి భవిష్యత్తు దిశగా అడుగులు వేయాలని స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఆర్.ధనుంజయ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా యువకులు నడుం బిగించాలన్నారు. చెడు మార్గాలలో యువకులు పయనిస్తే సమాజం పాడవుతుందన్నారు. విద్యార్థి దశ నుండే మంచి మార్గంలో పయనించేలా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని తెలిపారు. అనంతరం మూడు రోడ్ల జంక్షన్లో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యన్న కళాశాల విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

విశాలాంధ్ర - పరవాడ: ప్రజలకు భారంగా మారిన విద్యుత్ చార్జీలను ప్రభుత్వం తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నేతలు గురువారం పరవాడ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కమిటీ నాయకుడు వివి రమణ మాట్లాడుతూ రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటూ రైతులపై భారాలు మోపే విద్యుత్ విధానాలను తీసుకు రావడమే కాకుండా ప్రభుత్వం ప్రతి ఏటా విద్యుత్ చార్జీలు పెంచుతూ ప్రజల నెత్తిన అధిక భారాలు మోపుతుందని విమర్శించారు. రైతులకు ఉచిత విద్యుత్ అంటూనే స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని, దీనివలన భవిష్య త్తులో రైతాంగం తీవ్ర అవస్థలు ఎదుర్కొనే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. తక్షణమే విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. పీపీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సెక్రటరీ బాలకృష్ణ చొరవతో విద్యుత్ కాంతులు

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: గత కొన్ని రోజుల నుంచి అంధకారంలో మగ్గుతున్న మండల కేంద్రమైన దుంబ్రి గుడపై పోతంగి మేజర్ గ్రామపంచాయతీ సెక్రటరీ బాలకృష్ణ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ఈ నేపథ్యంలో అంధకారం నడుమ ఉన్న దుంబ్రిగుడలో విద్యుత్ కాంతులకై గురువారం విద్యుత్ స్తంభాలపై లైట్లను అమర్చారు. సెక్రటరీ బాలకృష్ణ తీసుకున్న ప్రత్యేక దృష్టిపై స్థానికులు అభినందించారు.

సజ్జల దృష్టికి ఎంపీపీల సమస్యలు

విశాలాంధ్ర - అనంతగిరి: రాష్ట్రంలో మండల పరిషత్ అధ్యక్షుల సమస్యలను ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్టు ఎంపీపీల సంఘం ఎస్టీ విభాగ రాష్ట్ర అధ్యక్షురాలు శెట్టి నీలవేణి తెలిపారు. ఎంపీపీల గౌరవ వేతనం 6000 నుంచి 15 వేల వరకు పెంచాలని, రవాణా చార్జీలను 8,000 నుంచి 20వేల రూపాయలకు పెంచాలని కోరారు. అదే విధంగా ఎంపీపీలకు వ్యక్తిగత సహాయకులను ఏర్పాటు చేయాలని కోరారు. మండల పరిషత్ సాధారణ అభివృద్ధి నిధుల వినియోగంలో ఎంపీపీలకు చెక్ పవర్ సదుపాయం కల్పించాలని విన్నవించారు. ఏజెన్సీ ఆచార సంప్రదాయాల దృశ్యం అధిక సంతానం అనాధిగా వస్తున్న తరుణంలో మన్య ప్రాంతంలో స్థానిక ఎన్నికల్లో ఇద్దరు కంటే అధిక సంతానం ఉన్నవారు పోటీకి అర్హులుగా అవకాశం కల్పించాలని కోరారు. అదేవిధంగా కాకినాడ జిల్లా రౌతులపూడిలో గిరిజన మహిళ అయినటువంటి ఎంపీపీ రాజ్యలక్ష్మిపై దాడికి పాల్పడిన ఘటనను ఈ సందర్భంగా ఆయన దృష్టికి తీసుకుని వెళ్లారు. దీనిపై స్పందించిన సజ్జల రామకృష్ణారెడ్డి తమ దృష్టికి వచ్చిందని సమస్య పరిష్కరించే దిశగా చూస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఎంపీపీల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి, జీకే వీధి ఎంపీపీలు అనూష దేవి, బోయిన కుమారి, అనంతగిరి వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు శెట్టి ఆనంద్, మండల నాయకులు షేక్ మదీనా, పాడి కృష్ణ మూర్తి, శ్రీను, పాల్గొన్నారు. అనంతరం అల్లూరి సీతారామరాజు జిల్లా వైసీపీ అధ్యక్షురాలు, పాడేరు శాసనసభ్యురాలు భాగ్యలక్ష్మిని, అరకులోయ శాసన సభ్యులు చెట్టి ఫాల్గుణని విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిసారు.

పాల సంఘం అధ్యక్షుడిగా అప్పలనాయుడు

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం విలాసకనపాలెం పంచాయతీలో పాల సంఘం ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికలలో పాల సంఘం అధ్యక్షులుగా బి.అప్పలనాయుడును పాడి రైతులు, పాలక వర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పద్మనాభ హెడ్ క్వార్టర్ సూపర్వైజర్ మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అప్పలనాయుడు మాట్లాడుతూ రైతుకు పాడి పంట రెండు కళ్ళు లాంటివని పంట నష్టాల్లో ఉండేటప్పుడు పాడి ద్వారానే తన కుటుంబ పోషణ, ఇతర అవసరాలు తీర్చుకోవడం రైతు చేస్తున్నాడని అన్నారు.

పాడి రైతులకు ఆధునిక పాడి పద్ధతులు అవలంబించడం ద్వారా గిట్టుబాటు ధర వచ్చేటట్లు చూస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులతో పాటు పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

గాజువాక నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: జీవీఎంసీ 88వ వార్డు మంగళపాలెం మెయిన్ రోడ్డుకు 19లక్షల 98 వేల జీవీఎంసీ నిధులతో హాట్ మిక్స్ తారు రోడ్డు వేయుటకు తిప్పల నాగిరెడ్డి శంకుస్థాపన గురువారం చేశారు. ఈ సందర్భంగా తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ గాజువాక నియోజకవర్గాన్ని నిరంతరం అభివృద్ధి చేస్తానన్నారు. అనంతరం కాలువ పూర్తిస్థాయిలో వేయడానికి జివిఎంసి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. తలారవానిపాలెం రైల్వే అండర్ గ్రౌండ్ పాత్ వే విస్తరణ చేయాలని, టిడ్కో గృహాలు నుండి తలారివానిపాలెం రైల్వే అండర్ గ్రౌండ్ వరకు సీసీ రోడ్డు వెయ్యాలని రైల్వే స్టేషన్ నుండి అగనంపూడి జాతీయ రహదారి వరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి బలిరెడ్డి సత్యానారాయణ వినతి అందజేశారు. దీనిపై తిప్పల నాగిరెడ్డి సానుకూలంగా స్పందించి తలారివానిపాలెం రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి పాత్ వే విస్తరణ చేయడానికి విశాఖ ఎంపీ ద్వారా రైల్వే ఉన్నత అధికారులతో చర్చిస్తామని, మిగిలిన అంశాలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలు నాయుడు, గాజువాక జోన్ కమిషనర్ పొందూరు సింహాచలం, ఈఈ ప్రసాద్ బాబు, ఏఈ తులసి, స్థానిక నాయకులు దాడి నూకరాజు, అమరపిన్ని అప్పలరాజు, మోటూరి వెంకటరమణ, మజ్జి శ్రీను, మదక నర్సింగరావు, గొర్లె వెంకటరమణ, రాపర్తి అప్పారావు, ఊరుకిటి శ్రీను, మదక నర్సింగ్ రావు, సత్తిబాబు, శంకర్రావు, ఉరికూటి శ్రీను, ఉరికూటి రాజు, గొన్న శ్రీను, అమర పిన్ని ముసలి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలోనే గిరిజన ప్రాంత అభివృద్ధి

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గిరిజన ప్రాంత అభివృద్ధికి ఎన్నడు లేని విధంగా నిధులు మంజూరు చేస్తున్నా రని పెదగూడా పంచాయతీ సర్పంచ్ మండి బాబురావు అన్నారు. గురువారం పెదగూడ పంచాయతీ గడప గడపకి సంబంధించి జర్రివడ గ్రామంలో 100 మీటర్లు 6 లక్షల రూపాయలు వ్యయంతో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వైసీపీ పార్టీ అధికా రంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలలో గిరిజన ప్రాంతం అభివృద్ధి విషయంలో గతంలో లేని విధంగా అధిక నిధులు మంజూరు చేసి రహదారులు, సీసీ రోడ్లు, త్రాగునీరు సమ స్యలు పరిష్కరించిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. పెద్దగూడ పంచాయతీకి పరిధిలో గ్రామాలన్నీ అభివృద్ధి పదంలో దూసుకుపోతున్నాయన్నారు. ఈ అభివృద్ధి ప్రతిపక్ష పార్టీ నాయకులకు కనిపించడం లేదా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ హయాంలో గిరిజన ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే నిధులు, జిల్లా పరిషత్ నిధులతో గిరిజన ప్రాంతం అభివృద్ధి బాటలో పయనిస్తుందని ప్రతిపక్ష పార్టీ నాయకులు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి టిసి గణపతి, కన్వీనర్ కూడా దాసు, వార్డు మెంబర్ కేశ్వ రావు, గ్రామ వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా విద్యుత్ సరఫరా



కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

వ్యవసాయానికి 9 గంటల నిరంతర విద్యుత్
విద్యుత్ మరమ్మతులు పూర్తి: కోతల్లేని విద్యుత్ సరఫరా

విశాలాంధ్ర - పాయకరావుపేట: గత 45రోజులుగా పాయకరావుపేట మండలంలో రైతులు, ప్రజలు పడుతున్న విద్యుత్ ఇబ్బందులు తొలగిపోయాయి. పాయకరావుపేట 132/33కెవి సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోవడంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వ్యవసాయానికి సాగునీరు లేక రైతులు జనరేటర్లు ఏర్పాటు చేసుకొని పంట భూములకు సాగునీరు అందించారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు ఎదురవడంతో జనరేటర్లు పెట్టి ట్యాంకులకు నీరు నింపి ప్రజలకు అందించారు. ఈ సమస్యలపై విద్యుత్ సరఫరా లేక ఎండుతున్న తమలపాకు తోటలు, విద్యుత్ సౌకర్యం లేక తాగునీటి ఇక్కట్లు, పాయకరావుపేటపై జిల్లా కలెక్టర్ దృష్టికి అనే వరుస కథనాలు విశాలాంధ్ర దినప్రతికలో ప్రచురితమయ్యాయి. దీనికి స్పందించిన విద్యుత్ జిల్లా యంత్రాంగం త్వరితగతిన సబ్‌స్టేషన్‌లోని కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఈనెల 19 తేదీన పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసి, 20వ తేదీన ఐడియల్ చార్జి చేసి యధావిధిగా ఉన్న పీడర్ లోడ్‌లు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మీద పనిచేసేలా చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తులు కారణంగా వేరే చోటికి మళ్లించిన ఫీడర్‌లోడ్‌ను తిరిగి యథాతదంగా 132/33కేవి మీదకు తీసుకొచ్చి విద్యుత్ సరఫరా అందిస్తున్నట్లు ఏపిఈపిడీసిఎల్ అనకాపల్లి డివిజనల్ ఎగ్జిక్యూ టివ్ ఇంజనీర్ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో వ్యవసా యానికి ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు నిరంతర విద్యుత్ అంది స్తున్నామని తెలిపారు. గ్రామాల్లో కోతలు లేకుండా విద్యుత్ సరఫరా అందిస్తు న్నామని తెలిపారు.

అలాగే ఈదురుగాలులకు నేలకొరిగిన విద్యుత్ స్థంభాలు అనే విశాలాంధ్రలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు సత్వరంగా స్పందించారు. మండలంలోని సత్యవరం గ్రామంలో 22 స్థంభాలు, విద్యుత్ తీగలు మార్చి ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా పూర్తి స్థాయిలో విద్యుత్ సరఫరాను గురు వారం నుండి అందిస్తున్నారని సత్యవరం గ్రామానికి చెందిన రైతులు తెలిపారు.

వ్యవసాయ బోర్ల నుండి వస్తున్న నీరు

నేరాల నియంత్రణపై దృష్టిసారించండి

వార్డు మహిళా పోలీస్ కార్యదర్శులకు సిపి విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నగర పోలీసు కమిషనర్ డా.సి.యం. త్రివిక్రమ వర్మ, ఆధ్వర్యంలో పోలీసు ఉన్నతాధికారులతో కలిసి మహిళా పోలీసులతో (వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శి) పుడా చిల్డ్రన్ ఏరినా నందు సమీక్షా సమావేశం నిర్వహించారు. సుమారు 500 మంది మహిళా పోలీసులు హాజరైనా ఈ సమావేశంలో మహిళా పోలీసులకు నగర పోలీసు ఉన్నతాధికారులు పలు సూచనలు జారీ చేశారు. సైబర్ ఫ్రాడ్స్, దిశా యాప్,యాంటీ డ్రగ్స్ వంటి వాటిపై అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. వారి పరిధిలో ఎటువంటి కుటుంబ కలహాల కారణముగా ఎటువంటి ఆత్మ హత్యలు,హత్యలు జరగకుండా సదరు కుటుంబాలకు అవసరమైన కౌన్సిలింగ్ ఇవ్వాలని తెలిపారు. వార్డులలో గల పాఠశాలలు , కాలేజీలలో విద్యార్థిని, విద్యార్థులకు గమనిస్తూ వారు ఎటువంటి చెడు వ్యసనాల జోలికి పోకుండా అవగాహన కలిగిస్తూ ఉండమని, మరింత ముఖ్యముగా బాలికలు, స్త్రీలకు ఉమెన్ సేఫ్టీ పై అవగాహన కలిగించాలని తెలిపారు. చివరగా ఇప్పటి వరకూ మహిళా పోలీసులు వారి విధులలో చూపిన ప్రతిభ ను కొనియాడుతూ, విశాఖ నగరం మరింత అభివృద్ధి దిశగా పయనించేందుకు మీ కృషి, తోడ్పాటు నగరానికి ఎల్లవేళలా అవసరం అనీ, ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి, ప్రశంసా పత్రం,క్యాష్ రివార్డు ఇచ్చి ప్రోత్సహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డి.సి.పి -01(లా %ఆర్డర్),డి.సి.పి -02 (లా ఆర్డర్), డి.సి.పి(క్రైమ్), ఏ.డి.సి.పి(క్రైమ్) ఏ.డి.సి.పి (స్పెషల్ బ్రాంచ్) ఏ.సి.పి (దిశా), దిశా పోలీసు అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీట్, జేఈఈ పరీక్షల్లో ఏపీటీడబ్ల్యూఆర్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల శిక్షణ సంస్థకి చెందిన విద్యార్థులు పలు పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపి మెరుగైన ర్యాంకులు సాధించారు. నీట్-2023 ప్రవేశ పరీక్షకు 28 మంది విద్యార్థులు హాజరవగా, అనకాపల్లి బయలు గ్రామానికి చెందిన కె. సత్తిబాబు అనే ఒక పేద వ్యవసాయ కూలీ, కె.మహేశ్వరిల కుమారుడైన కె.ఇస్సాకు అనే విద్యార్థి 420 మార్కులు 3073 వ ఆలిండియా (ఎస్టి కేటగిరీ) ర్యాంకు సాధించారు. చింతపల్లి మండలంలోని పాతకృష్ణాదేవిపేట అనే మారుమూల గ్రామంలో ఒక ఆదిమ గిరిజన తెగకు చెందిన పి. బంగార్రాజు అనే వ్యవసాయ కూలీ, పి. నీలమ్మ ల కుమారుడైన పి. మత్య రాజు 319 మార్కులను 10,371 వ ఆలిండియా ర్యాంకును (ఎస్ టి కేటగిరీ) కైవసం చేసుకున్నారు. హుకుంపేట మండలం ఈదుల గరువు గ్రామానికి చెందిన జి.ప్రసాద రావు అనే వ్యవసాయ కూలీ, జి. లక్ష్మి ల కుమారుడైన జి.గోపాల రావు 283 మార్కులు తో 14,651 వ ఆలిండియా ర్యాంకు (ఎస్టి కేటగిరీ లో) పొందారు. అదేవిధంగా ఐఐటీ జేఈఈ మెయిన్స్ -2023 పరీక్ష ఫలితాలలో పరీక్షకు హాజరైన 38 మంది విద్యార్థుల్లో అరకు వ్యాలీ మండలానికి చెందిన వి.రాహుల్ అనే విద్యార్థి కంప్యూటర్ ఇంజనీరింగ్ కావాలన్న లక్ష్యం తో కష్టపడి 86.1546 పెర్సెంటైల్ ను సాధించి రాష్ట్ర స్థాయిలో గురుకులాల్లో అగ్రస్థానం లో నిలిచాడు. కె. రవి శంకర్ అనే విద్యార్థి పీ డబ్ల్యు డి కేటగిరీలో ఆలిండియా విద్యుత్తి 87వ ర్యాంకును సాధించాడు. జె ఈ ఈ అడ్వాన్స్ -2023 ప్రవేశ పరీక్షకు 27 మంది విద్యార్థులు హాజరవగా దుంబ్రిగూడ మండలంలోని పిండలగూడ గ్రామానికి చెందిన జి.అర్జున్ అనే సాధారణ వ్యవసాయ కూలి కుమారుడైన జి. సంతోష్ అనే విద్యార్థి ఎస్.టి కేటగిరీ లో 483వ ర్యాంకును కైవసం చేసుకున్నాడు. అలాగే హుకుంపేట మండలంలోని ముక్కుమెట్ట గ్రామానికి చెందిన కె.సన్యాసి రావు అనే రైతు కుమారుడైన కె.సందీప్ అనే విద్యార్థి ఎస్.టి కేటగిరీ లో 583వ ర్యాంకును, గూడెం కొత్తవీధి మండలంలోని సిహెచ్ గంగవరం గ్రామానికి చెందిన వి.సోమరా అనే కూలి కుమారుడైన వి.మోహన్ అనే విద్యార్థి ఎస్.టి కేటగిరీ లో 1625 వ ర్యాంకును కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ విద్యార్థుల ను అభినందించారు.

కిడ్నాప్ ఉదంతంపై సమగ్ర విచారణ జరపాలి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ ఎంపి ఎంవివి సత్యనారాయణ కుటుంబం మరియు ఆడిటర్ జివి కిడ్నాప్ ఉదంతంపై సమగ్ర విచారణ వెంటనే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో జరపాలని జగదాంబ సిఐటియు ఆఫీస్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రాష్ట్ర సిపిఐ(ఎం) కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. 50గంటలు పాటు ఎం.పి. కుటుంబానికి, గవిమెన్ వెంకటేశ్వరరావు(జివి) చిత్ర హింసలు పెట్టినట్టు స్వయాన ఎం.పిగారే ప్రెస్‌మీట్‌లో తెలియజేశారు. కిడ్నాపర్లు డబ్బులు డిమాండ్ చేశారని తెలిపారు. అట్లాగే పోలీసులు సకాలంలో జోక్యం చేసుకొని ప్రాణనష్టం లేకుండా బయటపడ్డామని అదేవిధ వక్తం చేశారు. మొత్తం వ్యవహారం అనేక అనుమానాలు ప్రజలకు కలిగిస్తున్నది. దీనిపై సమగ్ర విచారణ చేస్తే తప్ప వాస్తవాలు బయటకు రావు. హేమంత్ కూడా ఎం.పిగారితో లావాదేవీలు నాకు ఉన్నాయని దాదాపు 5కోట్లు రూ!లు ఇవ్వాలని ప్రచారం జరుగుతుంది. ఇందులో సుబ్బలక్ష్మి గారు ఎవరు అన్నది తేల్చాలి? దీనిపై సమగ్ర విచారణ చేయాల్సిన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సరైన విచారణ జరిపించకుండా నిర్లక్ష్యం చేయడం సరైంది కాదన్నారు. ఈ సమావేశంలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యదర్శి వర్గ సభ్యులు బి.జగన్ పాల్గొన్నారు.

గృహ సారథి రాములమ్మ ఆకస్మిక మరణం విచారకరం

విశాలాంధ్ర - చింతపల్లి: గృహ సారథి కొర్రా రాములమ్మ ఆకస్మిక మరణం విచారకరమని జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. మండలంలోని బెన్నవరం పంచాయితీ పెదకొండ గ్రామ గృహసారథిగా ఉన్న రాములమ్మ బుధవారం ఆకస్మికంగా మృతి చెందింది. మూడు నెలల పాప కలిగిన ఆమె అకాల మరణం ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, మండల కన్వీనర్ కురుస తిరుపతి, ఆ పంచాయితీ సచివాలయ కన్వీనర్ బచ్చల బొజ్జన్నదొరలతో కలిసి రాములమ్మ మృతదేహాన్ని (పార్థివ దేహాన్ని) సందర్శించింది ఆమె ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు. ఈ విషయాన్ని పాడేరు శాసనసభ్యురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి దృష్టికి తీసుకువెళ్లి రాములమ్మ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకునేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పథకంపై అవగాహన

విశాలాంధ్ర - కూనవరం: రాష్ట్ర ప్రభుత్వం మరో కొత్త పథకానికి శ్రీకారం చుట్టిందని జగనన్న సురక్ష పేరుతో ఈ కొత్త పథకాన్ని అమలు చేస్తున్నట్లు జెడ్పీటీసీ మండల ఇన్చార్జి ఆవుల మరియదాసు తెలిపారు. గురువారం చిరిగేవులగూడెం సచివాలయంలో జగనన్న సురక్ష పథకం అమలుపై వాలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు అవగాహన కల్పించారు. సంక్షేమ పథకాలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే వాటిని త్వరగా పూర్తి చేయుటకు ప్రభుత్వం ఈ కొత్త పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ పథకానికి సంబంధించి జూన్ 24వ తేదీ నుండి వాలంటీర్ల ద్వారా ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఏ సురేష్, మేరుకులం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్, వెల్ఫేర్ అసిస్టెంట్ సంకీర్తన, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, సొసైటీ చైర్మన్ నోముల కొండలరావు, సర్పంచులు తెల్లం నిరోషా, రామయ్య, సచివాలయ కన్వీనర్లు నోముల సత్యనారాయణ, చిర్నాడి మంజుల, చిలకమ్మ లక్ష్మణరావు, జేడి మద్దుమ్మ, పద్మావతి, కట్టిపోయిన వెంకటేశ్వరరావు, మునిగిల వుప్పు పాల్గొన్నారు.

పాదయాత్రకి సీపీఐ సంఘీభావం

విశాలాంధ్ర - కూనవరం: పోలవరం నిర్వాసితుల పోరు కేక మహా పాదయాత్ర మాదవరోజు గురువారం అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం కొండరాజుపేట గ్రామం మీదుగా సాగింది. ఈ పాదయాత్రకు సీపీఐ డివిజన్ కమిటీ సంఘీభావం తెలిపింది. సీనియర్ నాయకులు మంద దుర్గాప్రసాద్, డివిజన్ కార్యదర్శి గుజ్జ మోహన్ రావు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల హక్కుల సాధన కోసం గౌరవప్రదమైన ప్యాకేజీ కోసం సీపీఎం తలపెట్టిన ఈ 400 కిలోమీటర్ల మహా పాదయాత్ర నిర్వాసితుల చరిత్రలో గొప్ప మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి తలపెట్టిన ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సంఘీభావం తెలపాలి ప్రతి నిర్వాసితుడు భాగస్వామి కావాలని అన్నారు. కొండరాజుపేట గ్రామ మహిళలు వెంకటమ్మ, నరసమ్మ, గుజ్జ విజయ తదితరులు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కార్యదర్శి వర్గ సభ్యులు సుబ్బయ్య, మంతెన సీతారాం తదితరులకు వీర తిలకం దిద్ది స్వాగతం పలికారు.

గుర్తు తెలియని వాహనం ఢీ: ఇద్దరు మృతి

విశాలాంధ్ర - మారేడుమిల్లి: మారేడుమిల్లి మండలం ఐజంపల్లి, భీమవరం మధ్య ఘాట్ రోడ్డో మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనాన్ని భీమవరం వైపు నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొంది. వై.రామవరం మండలం చింతలపూడి గ్రామానికి చెందిన రేవుల రమేష్ రెడ్డి(23), కత్తుల వీరపరెడ్డి(18) మృతి చెందారని స్థానికులు తెలిపారు. హుటాహుటిన 108లో మారేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించి పంచనామా నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మారేడుమిల్లి పోలీసులు సంఘటనా స్థలాన్ని చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైతులకు విత్తనాలు, వ్యవసాయ రుణాలు పంపిణీ

విశాలాంధ్ర - నక్కపల్లి: మండలంలో గురువారం వేంపాడు పీఏసీఎస్ సొసైటీలో రైతులకు విత్తనాలు, వ్యవసాయ రుణాలు, చెక్కులను సొసైటీ చైర్‌పర్సన్ సూరకాసుల రామలక్ష్మి, గోవింద చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేంపాడు సొసైటీ చైర్‌పర్సన్ సూరకాసుల రామలక్ష్మి మాట్లాడుతూ వేంపాడు సొసైటీ పరిధిలో 22 మంది రైతులకు వ్యవసాయ కొత్త రుణాలు అందించడం జరిగిందని, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ టి.వీరప్పడు సత్యనారాయణ, రైతు భరోసా అగ్రికల్చర్ ఆఫీసు గాయత్రి, రావి బాబూరావు, ఈశ్వరరావు, సత్తిబాబు, శ్రీను, గింజాల బుజ్జి, నోకేష్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేద్దాం

విశాలాంధ్ర - సీలేరు: పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం సిపిఐ ఆధ్వర్యంలో ఈ నెల 26న పోలవరంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకరి విష్ణుమూర్తి కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేస్తున్నాయన్నారు. జగన్ ప్రధాని మోది భజన మానుకోవాలన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడం కన్నా ముందు ముంపు బాధితులకు పునరావాసం, ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పై జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు.

రైతులకు వరి విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర - అనంతగిరి: గుమ్మకోట గ్రామపంచాయతీ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచ్ పాగి అప్పారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి గడపగడపకు వెళ్లి ప్రభుత్వం ఇప్పటివరకు అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలు వివరించాలని అన్నారు. అనంతరం రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలను హార్టికల్చర్ అసిస్టెంట్ ద్వారా అందజేశారు.

రూపురేఖలు మారుతున్న బోయినవారి చెరువు

విశాలాంధ్ర - గొలుగొండ: గొలుగొండ మండలం మేజర్ పంచాయితీ ఏఎల్ పురం గ్రామంలో ఊరిని ఆనుకొని ఉన్న బోయిన వారి చెరువును ఆహ్లాదకరంగా తయారుచేసి వాకింగ్ ట్రాక్ నిర్మించినట్లయితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని విశాలాంధ్రలో ప్రచురించిన వార్తకు స్పందించిన అధికారులు ఉపాధి హామీ పథకం ద్వారా చెరువులో ఉన్న పిచ్చి మొక్కలను గత నాలుగు రోజుల నుండి తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. అయితే వాకింగ్ ట్రాక్ ఆహ్లాదకరంగా ఉండేందుకు పూల మొక్కలను నాటినట్లయితే చెరువు పరిసరప్రాంతం ఉంటుందని ఆ ప్రాంతంలో ఎటువంటి వ్యర్థ పదార్థాలు వేసేందుకు అవకాశం ఉండదని, కావున అధికారులు సత్వరమే వాకింగ్ ట్రాక్ నిర్మించాలని ఈ ప్రాంత ప్రజానీకం కోరుతున్నారు.

తహశీల్దార్‌గా కె.సత్యనారాయణ

విశాలాంధ్ర - దేవీపట్నం: అల్లూరి జిల్లా దేవీపట్నం తహశీల్దార్‌గా కె.సత్య నారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. తూర్పు గోదావరి జిల్లా కడియం డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేసిన ఈయన పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేసిన రామకృష్ణ డిప్యూటీ తహశీల్దార్‌గా ఇక్కడే కొనసాగుతున్నారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణకు పలువురు కార్యాలయ సిబ్బంది, రాజకీయ నాయకులు అభినందనలు తెలిపారు.

వైయస్సార్ పశు బీమా అమలుకు చర్యలు

విశాలాంధ్ర - కె.కోట పాడు: వైయస్సార్ పశు బీమా పథకాన్ని పక్కాగా అమలు చేయాలని పశువైద్య సహాయ సంచాలకులు బైరాగి అన్నారు. గురువారం దేవరాపల్లి, కె.కోటపాడు మండలాలకు చెందిన సిబ్బందితో సమావేశమయ్యారు. సంకరజాతి ఆవు గేదె ఎద్దు మృతి చెందితే 30 వేల రూపాయలు, దేశవాళీ ఆవు, ఎద్దు, గేదె మృతి చెందితే రూ. 15000, గొర్రె, మేక, పంది మృతి చెందితే 6000 బీమా పరిహారం కింద ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఒక కుటుంబానికి చెందిన ఐదు పశువులు 50 గొర్రెలు, మేకలకు ఈ బీమా వర్తిస్తుందని అన్నారు. గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేయడానికి నేటినుండి వరకు సమయం ఉందని తెలిపారు. ఈ సమావేశంలో పశువైద్యాధికారులు నాయుడు, మేనక తదితర సిబ్బంది పాల్గొన్నారు.

అరిలోవ రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం

విశాలాంధ్ర - గొలుగొండ: గొలుగొండ మండలంలో ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని అరిలోవ అటవీ రోడ్డు మార్గం ఎట్టకేలకు నర్సీపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ చేతుల మీదుగా గురువారం శంకు స్థాపన చేశారు. ఈ మార్గంలో వాహనదారులు పడే కష్టాలు వర్ణనాతీతం. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ఈ అటవీ మార్గం అభివృద్ధికి చెందిన దాఖలాలు లేవని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ చొరవతో ఈ రోడ్డుని పునర్నిర్మాణం చేపడుతున్నందుకు గొలుగొండ మండల ప్రజలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

సెల్ సిగ్నల్ లేక అవస్థలు

విశాలాంధ్ర - సీలేరు: జీకేవీధి మండలం దారకొండలో మూడు రోజుల నుండి బిఎస్ఎన్ఎల్ సెల్ సిగ్నల్ లేక వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం నుంచి సిగ్నల్ లేకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాలలో పనులకు అంతరాయం ఏర్పడుతుంది. దారకొండ పంచాయితీకి ఆధార్ కోసం గుమ్మిరేవుల పంచాయతీల నుండి అనేక మంది గిరిజనులు వస్తున్నారు. అయితే సెల్ సిగ్నల్ లేక నిరాశతో వెనుతిరుగుతున్నారు. అలాగే పాఠశాలలో అడ్మిషన్ల నిమిత్తం వచ్చే విద్యార్థులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ముద్రగడ తీరుతో కాపు మహిళగా సిగ్గుపడుతున్నా!

జనసైనికురాలు పిన్నింటి పార్వతి

విశాలాంధ్ర - పెందుర్తి: కాపు సామాజిక వర్గీయుల పిల్లల భవిష్యత్తు కోసం ఆరాటపడుతున్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు, కుట్ర, కుతంత్రంతో లేఖ రాసిన ముద్రగడ పద్మనాభం వ్యవహారశైలి కాపు మహిళగా సిగ్గుపడేలా చేసిందని జన సైనికురాలు, వీరమహిళ పిన్నింటి పార్వతి ఆక్షేపించారు. జీవీఎంసీ 94వ వార్డు, జనసేన కార్యాలయంలో పార్టీ నాయకులతో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. కొడుకు ఎంపీ సీటు కోసం ముద్రగడ, కాపు ఉద్యమాన్ని వైసీపీకి తాకట్టు పెట్టారని విమర్శించారు. గురువింద గింజ తన నలుపు ఎరుగనట్లుట్లు ప్రజలకోసం సర్వస్వం త్యాగం చేసిన పవన్ కళ్యాణ్‌కు, ముద్రగడ సూక్తులు చెప్పన్నారని మండిపడ్డారు. జగన్‌పై అవినీతి కేసులు తేల్చాలంటూ కోర్టులో కేసు వేసిన ముద్రగడ ఆయనతోనే బేరం మాట్లాడుకున్నారని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ సభలకు వస్తున్న ప్రజాదరణ చూసి వైసిపి నాయకులు ఓర్వలేకపోతున్నారని పార్వతి విమర్శించారు.

యువతకు క్రీడా సామాగ్రి పంపిణీ

విశాలాంధ్ర - పద్మనాభం: యువత క్రీడల పోటీలలో దేశానికి కీర్తి ప్రతిష్టలు తేవాలని నెహ్రూ యువ కేంద్ర సమన్వయ అధికారి అన్నారు. కురుపల్లి గ్రామం, పద్మనాభ మండలం నెహ్రూ యువ కేంద్ర, శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల వికాలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్, ప్రకృతి చికిత్సాలయ మహారాణిపేట సంయుక్త నిర్వహణలో కురుపల్లి, రేవిడి, రౌతులపాలెం, తుని వలస, రెడ్డిపల్లి మొదలు గ్రామాల యువతకు క్రీడా సామాగ్రి పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జి.మహేశ్వరరావు విచ్చేశారు. ఈ సందర్భంగా 1985 కామన్వెల్త్ క్రీడలలో వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో బంగారు పతకం సాధించిన ఎంవి మాణిక్యాలను, జాతీయస్థాయిలో వంద మీటర్లు, రెండు వందల మీటర్లు, పరుగు పందెములలో పతకాలను సాధించిన ప్రభుదాను, దేశ విదేశాలలో వంద మీటర్లు, 50 మీటర్లు హార్డిల్స్ నందు, లాంగ్ జంప్, హై జంప్ బంగారు పతకాలను సాధించిన ఎస్.శ్రీలక్ష్మి, ప్యారిస్ నగరములో జరిగిన క్రీడలలో పాల్గొని బంగారు, రజిత పతకములు సాధించిన కుమారి యామినిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ మానవ సేవ జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్, రంగస్థల, కళాకారుల సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర ఉపాధ్యక్షులు ఉప్పాడ అప్పారావు, స్థానిక వ్యాపార రత్నం రెడ్డిపల్లి లక్ష్మణరావు, కురుపల్లి గ్రామ పెద్దలు పాలూరి కృష్ణారావు, నీలం శెట్టి చిన్నయ్య, శుభం బలరామ ట్రస్ట్ అధినేత పివి ప్రసాద్ పట్నాయక్, పి.పవన్, ఎన్.వెంకటేష్, శేఖర్, శంకర్, బంగారు రాజు, బట్ట కనక, ఎం.గౌరి రెడ్డి, పల్లా భరత్ కుమార్, కంటుభక్త శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మిగులు సీట్లకు అడ్మిషన్లు

విశాలాంధ్ర - పెందుర్తి: ఉత్తరాంధ్ర జిల్లాల్లో నాణ్యమైన కంటి వైద్య సేవలు అందించడంలో పేరుగాంచిన విశాఖపట్నం, నాయుడుతోట వద్ద గల శంకర్ ఫౌండేషన్ ఐ హస్పిటల్ అండ్ ఇనిస్టిట్యూట్ నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే గుర్తించబడిన పారామెడికల్ కోర్సుల్లో మిగులు సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ఆ సంస్థ డీజీఎం (పి.ఆర్.) కె.బంగార్రాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులకు మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ - ఫిమేల్ 20 సీట్స్, ఆప్తాల్మిక్ టెక్నీషియన్ (ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్స్) 20 సీట్స్ కలవని ఆయన తెలిపారు. ఇంటర్మీడియట్ ఏ గ్రూప్‌లోనైనా ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిప్లొమా ఇన్ మెడికల్ స్టెరిలైజేషన్ అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్ 15 సీట్స్, డిప్లొమా ఇన్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్ కోర్స్ 25 సీట్స్, డిప్లొమా ఇన్ ఆప్టోమెట్రీ టెక్నీషియన్ కోర్స్ 30 సీట్స్ ఉన్నాయని తెలియచేశారు. ఇంటర్మీడియట్ బైపిసి చదివిన విద్యార్థులకు బి.ఎస్సీ ఆప్టోమెట్రీలో 8 సీట్స్ ఉన్నాయని బంగార్రాజు తెలిపారు. శంకర్ ఫౌండేషన్ పారా మెడికల్ కాలేజీలో ఫీజు చాలా తక్కువని, పేద విద్యార్థులు కాలేజీ ఫీజును వాయిదాలుగా చెల్లించుకునే వెసులుబాటు కలదని వెల్లడించారు. పారా మెడికల్ కోర్సు పూర్తి చేసిన వారికి అనేక హాస్పిటల్స్‌లో ఉద్యోగ అవకాశములు లభిస్తాయని పేర్కొన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన మరిన్ని వివరాలకు 9121005933ను సంప్రదించాలని సూచించారు.

క్యాన్సర్ బాధితుని కుటుంబానికి ఆర్థిక చేయూత

- ఉదారత చాటుకున్న పదవ తరగతి మిత్ర బృందం

విశాలాంధ్ర - చింతపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న స్నేహితుని కుమారుని ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని చలించి 2003-2004లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన నాటి సహ విద్యార్థి కసా నాగేశ్వరరావు కుటుంబానికి ఎల్లవేళలా తామంతా అండగా ఉంటామని భరోసా కనిపిస్తూ ఆ కుటుంబానికి ఆ బ్యాచ్ మిత్ర బృందం గురువారం 30 వేల రూపాయల నగదు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మధ్యకాలంలో తమ బ్యాచ్ మిత్ర బృందమంతా గెట్ టు గెదర్ ఏర్పాటు చేసుకున్న క్రమంలో తమ మిత్రుడైన నాగేశ్వరరావు కుమారులలో ఒకరైన బాల సాయి భవాని ప్రసాద్ (13) క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడని తెలుసుకున్న మిత్రులందరూ తమకు తోచిన విధంగా ఆర్థిక సహాయం చేసుకుని నేడు ఆ కుటుంబానికి 30 వేల రూపాయల నగదు అందించారు. దీంతో ఆపదలో ఉండి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న తన కుటుంబాన్ని ఆదుకునేందుకు తన తోటి క్లాస్‌మేట్ మిత్రులంతా ఆర్థికంగా చేయూతను అందించడం ఆనందంగా ఉందని ఇద్దిందని నాగేశ్వరరావు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో తమ క్లాస్‌మేట్స్ లో ఎవరికి ఎటువంటి ఆర్థిక సహాయ సహకారాలు అవసరమైనా తామంతా ఒకే మాటపై ఉండి ఇబ్బందులలో ఉన్న వారికి అండగా ఉండేందుకు తామున్నామంటూ ముందుకు వచ్చేందుకు ఎల్లవేళలా కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆ బ్యాచ్ మిత్ర బృందం సభ్యులు తెలిపారు.

ఎస్‌పిఐఈఎఫ్ 2023లో ఉత్తర సముద్ర మార్గం అభివృద్ధి ప్రణాళికలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: 2021-2023లో ఆర్కిటిక్ కౌన్సిల్ యొక్క రష్యన్ అధ్యక్షతలో భాగంగా సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ ఫోరంలో రోస్కాంగ్రెస్ ఫౌండేషన్ నిర్వహించిన "నార్తర్న్ సీ రూట్ అవుట్‌పుట్స్ అండ్ ప్లాన్స్" సెషన్‌లో పాల్గొన్నవారికి ఉత్తర సముద్ర మార్గం యొక్క సుస్థిర అభివృద్ధి, అలాగే దాని భవిష్యత్తు అవకాశాలు, ఐస్‌బ్రేకింగ్ నౌకల పరంగా రష్యన్ కంపెనీల అవసరాలు అన్నీ చర్చనీయాంశాలు అయ్యాయి. "నార్తర్న్ సీ రూట్, మొదటగా, ఆసియా మార్కెట్లకు ఒక మార్గం, గ్లోబల్ లాజిస్టిక్స్‌లో ఒక భాగం. మర్మాన్స్క్ నుంచి షాంఘైకి 7000 మైళ్లు, షాంఘై నుంచి జిబ్రాల్టర్, సూయజ్ కెనాల్ మీదుగా మర్మాన్స్క్‌కు 12,500 మైళ్ల దూరంలో ఉంది. వ్లాదిమిర్ పనోవ్ వివరాలు వెల్లడించారు.

నాలుగు కిలోల గంజాయి స్వాధీనం

విశాలాంధ్ర - గొలుగొండ: గొలుగొండ మండలం ఏఎల్ పురం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అనుమాన స్పదంగా తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి నాలుగు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు కృష్ణదేవిపేట ఎస్ఐ ఉపేంద్ర గురువారం విలేకరులకు తెలిపారు. పట్టుబడిన వ్యక్తులు కుంచం చినరాజప్ప (18), పవన్ కుమార్ (20), మండపాటి వీరాంజనేయులు (35)తోపాటు 11000 నగదు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేసి జైలుకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీల పెంపుదలను నిరసిస్తూ సిపిఎం పార్టీ పిలుపుమేరకు దుంబ్రిగూడ మండల కేంద్రంలోని 11/33 విద్యుత్ ఉపకేంద్ర కార్యాలయ ఆవరణలో గురువారం సిపిఎం పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. భవిష్యత్తులో రానున్న స్మార్ట్ మీటర్లతో ప్రజలకు తీవ్ర ముప్పు ఉందని, సామాన్య మధ్యతరగతి ప్రజల నుంచి కార్పొరేట్లు జేబులు నింపుకోవడానికి సర్కార్ ఇటువంటి చర్యలు తీసుకుంటుందని ఆందోళనకారులు చెప్పారు. విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో దశలవారీగా ఆందోళన ఉధృతం చేయక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ప్రధాన కార్యదర్శి ఎవిటి పోతురాజు, మండల నాయకుడు పి సత్యనారాయణ, గిరిజనులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రంజంగావ్ తయారీ యూనిట్‌కు ఐఎస్ఐ సర్టిఫికేట్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: భారతీయ ఉపకరణాల పరిశ్రమలో అగ్రగామి సంస్థగా పేరు తెచ్చుకుని వినియోగదారులకు అత్యుత్తమ ఉత్పత్తులను అందిస్తోంది హయర్ అప్లయన్సెస్ ఇండియా. హైయర్ అప్లయన్సెస్‌లో గ్లోబల్ లీడర్‌గా 14 ఏళ్ల పాటు మేజర్ అప్లయన్సెస్‌లో ప్రపంచ నంబర్ 1 బ్రాండ్‌గా పేరు తెచ్చుకుంది. ఇప్పటికే ఎన్నో ఉపయోగకరమైన ఉత్పత్తులను అందించిన హయర్... తన పోర్ట్ ఫోలియోను ఎప్పటికప్పుడు మరింత బలోపేతం చేసుకుంది. ఇప్పుడు రంజంగావ్‌లోని ఫ్రీజర్ తయారీ యూనిట్ - పుణే ప్రతిష్ఠాత్మకమైన ఐఎస్ఐ సర్టిఫికేషన్‌ను పొందడం ద్వారా మరో ముఖ్యమైన మైలురాయిని సాధించింది. ఈ సర్టిఫికేషన్‌ను బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ జారీ చేస్తుంది. హయర్ సంస్థ అందించే ఉత్పత్తులు భద్రత, మన్నిక, పనితీరు కోసం అత్యున్నత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని ఈ సంస్థ ధృవీకరిస్తుంది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - పరవాడ: పరవాడ మండల పరిధిలో విద్యుత్ మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్న కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ సెక్షన్ ఏఈ శేషసాయి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పరవాడ, గొర్లెవానిపాలెం, దేశపాత్రునిపాలెం, ఈ.భోనంగి, పి.భోనంగి, కలపాక, వెన్నెలపాలెం, రావాడ, వాడచీపురుపల్లి, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, నాయుడుపాలెం, సునవర్తి, దోసూరు, తానాం, భరణికం, వెంకటాపురం తదితర గ్రామాల్లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన వెల్లడించారు.

నర్సింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేస్తాం

ప్రభుత్వ సలహాదారుదు సజ్జల రామకృష్ణ హామీ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: వైద్య, ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న నర్సింగ్ సిబ్బందిని దశల వారీగా రెగ్యులరైజ్ చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుదు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. అమరావతిలోని రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నుంచి కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగానే రాజం ఎమ్మెల్యే కంబాల జోగులు, కేజీ హెచ్ సీనియర్ నర్సులు సుజానమ్మ, భవానీలు, పలువురు కాంట్రాక్ట్ నర్సులు వారు ఆసుపత్రిల్లో విధి నిర్వహణ సమయయంలో ఎదుర్కొంటున్న పలు సమస్యలను రామకృష్ణారెడ్డికి తెలియజేశారు. ముఖ్యంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రస్తుతం ఉన్న ముగ్గురు స్టాఫ్ నర్సులతో పాటు, నాల్గవ స్టాఫ్ నర్సును కూడా నియమించాలని, టీచింగ్ ఆసుపత్రుల్లో క్యాడర్ కంటే తక్కువ ఉన్న నర్సింగ్ సిబ్బందిని ప్రభుత్వ నిబంధనల మేరకు నియమించాలని, చాలా కాలంగా పెండింగ్లో ఉన్న పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. వీటి పై సానుకూలంగా స్పందించిన సజ్జల రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఆరోగ్యశాఖలో చాలా వరకూ ఖాళీలను పూర్తిస్థాయిలో భర్తీ చేశామని, దశల వారీగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరణ చేస్తామని, ఏ ఒక్క ఉద్యోగికి అన్యాయం జరగకుండా అందరికీ తగిన విధంగా న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ నుంచి నర్సింగ్ ప్రతినిధి భవానీ, కాంట్రాక్ట్ నర్సింగ్ స్టాఫ్ లు సతీష్, సత్యలక్ష్మీ మణి,శ్రీ లక్ష్మి, వీర భద్ర పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

రొమ్ము క్యాన్సర్పై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర -విశాఖ సిటీ : రొమ్ము క్యాన్సర్ పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లయన్స్ క్యాన్సర్, జనరల్ ఆసుపత్రి నిర్వాహకులు ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు సూచించారు. రెండు లక్షల రూపాయలు విలువ చేసే రొమ్ము కాన్సర్ చికిత్స పరికరాలను కెజిహెచ్ కి విరాళంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కెజిహెచ్ లోని రేడియో థెరపీ విభాగధిపతి డాక్టర్ ఎ. వై. రావు లయన్స్ క్యాన్సర్ ఆసుపత్రికి చేసిన విజ్ఞాపన మేరకు ఈ పరికరాలు అందజేశామన్నారు. డాక్టర్ ఎ. వై. రావు మాట్లాడుతూ ఈ విషయం లో ఆచార్య ఉమామహేశ్వరరావు చొరవ, ప్రోత్సాహం ప్రశంసనీయం అన్నారు. ఆసుపత్రి లో మరిన్ని మెరుగైన సేవలు బ్రెస్ట్ క్యాన్సర్ రోగులకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమం లో లయన్స్ క్యాన్సర్, జనరల్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కళ్యాణ్ ప్రసాద్, కేజీహెచ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పాండురంగ కుమారి తదితరులు పాల్గొన్నారు.

వెల్లంకి-2లో బీజేపీ గృహ సంపర్క్

విశాలాంధ్ర - భీమిలి: 9 ఏళ్ళుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుపరిపాలన పూర్తి సందర్భంగా గృహ సంపర్క్ ప్రారంభం సందర్భంగా బిజేపి విశాఖ జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షులు,పి.వి.వి. ప్రసాదరావు పట్నాయక్ ఆధ్వర్యంలో ఆనందపురం మండలంలో వెల్లంకి గ్రామ పంచాయతీ లో వెల్లంకి-2, గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా సుపరిపాలన అందిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారని అంతర్జాతీయంగా నరేంద్ర మోదీ దేశానికి ఎనలేని కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టారని కొనియాడారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రధానమంత్రి ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు,ముద్ర రుణాలు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, కిసాన్ సన్మాన్ యోజన, లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వెల్లంకి బూత్ అధ్యక్షులు:- పి.సాయి రమేశ్,ఇంటి సత్తిరాజు,బోర శ్రీను,పి.సాయి రౌతు రమణ,రౌతు మోహన్ కుమార్, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి హయాంలోనే అభివృద్ధి

విశాలాంధ్ర - యస్. రాయవరం :టిడిపి ప్రభుత్వం హయాంలో గ్రామాల్లో ఎంతో అభివృద్ధి చెందిందని రాష్ట్ర టిడిపి సీనియర్ నాయకులు కళా వెంకటరావు అన్నారు. గురువారం సాయంత్రం టిడిపి సమావేశం నిర్వహించారు. ముందుగా మహాకవి గురజాడ అప్పారావు ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కళా వెంకట్రావు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి వైయస్. జగన్మోహన్ రెడ్డి ఒక చేత్తో పది రూపాయలు ఇచ్చి మరో చేత్తో వంద రూపాయలు లాక్కుంటున్నారని విమర్శిం చారు. పంచాయతీ ఖాతాలో కేంద్ర ప్రభుత్వం వేసిన నిధులను మూడు రోజుల్లోనే జగన్మోహన్ రెడ్డి లాగేసుకుంటున్నారని అన్నారు. సంపద సృష్టించడం పేదలకు పంచడం చంద్రబాబు నైజం అన్నారు ఎస్సీలపైనే అట్రాసిటీ కేసులు పెట్టిన ఘనత జగన్ రెడ్డికి చెందుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే అనిత మాట్లాడుతూ దసరాకి పూర్తి మేనిఫెస్టో వస్తుందన్నారు. రైతులు వ్యవసాయం చేయలేని స్థితికి ప్రభుత్వం తీసుకొచ్చింది అన్నారు. విద్యుత్ బిల్లులు చూస్తే ప్రజలకు షాక్ కొడుతుందుని అన్నారు మరో ఆరు నెలల్లో తెదేపా అధికారంలోకి రావడం ఖాయం అని పేర్కొన్నారు. జె.వి. పాలెం గ్రామంలో మాజీ వజ్రపు శంకర్ రావు ఆధ్వర్యంలో టిడిపి లో కి వైసీపీ కార్యకర్తలు చేరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ చిరంజీవి రావు జిల్లా టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగ జగదీశ్వరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పులు చలపతిరావు, మాడుగుల మాజీ ఎమ్మెల్యే రామా నాయుడు, విజయనగరం జిల్లా టీడీపీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, మాజీ ఎంపీపీ వినోద్ రాజు, మండల పార్టీ అధ్యక్షులు అమలకంటి అబద్ధం కొప్పిశెట్టి వెంకటేష్, జానకి శ్రీను సీనియర్ నాయకులు కందుల వెంకటేశ్వరరావు, నల్లప రాజు వెంకటరాజు, తుంపాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రానీని అభినందించిన జెడ్పీటీసీ

విశాలాంధ్ర - అనంతగిరి: ఇంటర్లో రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించిన సమర్ధి ఇంద్ర జగనన్న ఆణిముత్యం పురస్కారం లభించింది. ఈ మేరకు జెడ్పీటీసీ దీసరి గంగరాజు ఇంద్రాణీని అభినందించారు. అరకు వ్యాలీ ఎపిఆర్ గురుకులం యండపల్లివలస ఇంటర్ సెకండ్ ఇయర్ సి. ఇ. సి ఫలితల్లో స్టేట్ మొదటి ర్యాంక్ 919 మార్కులు సాధించి గిరి సత్తాను చాటింది. అనంతగిరి మండలం టోకూరు పంచాయితీ పింపోడగుడ గ్రామానికి చెందిన సమర్ధి జగబందు, సీతమ్మల కుమార్తె సమర్ధి ఇంద్ర ఉత్తమ ప్రతిభ కనపర్చి నగదు పురస్కారాన్ని ప్రశంసాపత్రాన్ని అందుకుంది. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ తనకు తోచిన చిరుకానుక అదించి నిన్ను మంచి ఉన్నతస్థాయిలో గిరిజనం చూడాలని కోరుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జన్ని గుండు, దీసరి లక్ష్మణరావు, పాంగి గౌరమ్మ, రంభ కుటుంబీకులు ఉన్నారు.

కలుపు నివారణ కొత్త మందు నోవ్లెక్ట్ ఆవిష్కరణ

విశాలాంధ్ర -విశాఖపట్నం: వరి పొలాల్లో విస్తృత శ్రేణి బ్రాడ్లీఫ్, గడ్డి కలుపు మొక్కలు, చంపడానికి కష్టమైన కలుపు జాతులను నియంత్రించడానికి గ్లోబల్ ప్యూర్-ప్లే అగ్రికల్చర్ కంపెనీ కోర్టెవా అగ్రిసైన్స్ నోవ్లెక్ట్ను ప్రారంభించింది. డైరెక్ట్ సీడెడ్ రైస్ (డిఎస్ఆర్)తో సహా సమర్థవంతమైన కలువు నిర్వహణలో నోవ్లెక్ట్ రైస్ హెర్బిసైడ్ ప్రత్యేకమైన కలయిక రిన్స్కార్ యాక్టివ్ చాలా ప్రయోజనకరంగా ఉంది. ఇది అనుకూలమైన టాక్సికాలజీ, ఎకోటాక్సికాలజీ ప్రొఫైల్ను కలిగి ఉంది. ఇది నేల ఆరోగ్యానికి, పర్యావరణానికి ప్రయోజనం చేకూరుస్తుంది. అధునాతన సూత్రీకరణ సులభంగా నిర్వహించడానికి కలపడానికి, అనువర్తనానికి అనుమతిస్తుంది. వేరియబుల్ వాతావరణ పరిస్థితులు, నీటి నిర్వహణ వాతావరణాలలో సమర్ధవంతంగా పనిచేసే ఒక విలక్షణమైన ఉత్పత్తిగా ఇది పనిచేస్తుంది. ఈ ఉత్పత్తి ఏఎల్ఎస్ (ఎసిటోలాక్టేట్ సింథేస్), ఏసీకేస్ (ఎసిట్కెల్- కోఎంజైమ్ ఎ కార్బాక్సిలేస్), హెచ్పీపీడీ (హైడ్రాక్సీ ఫెనిల్పైరువేట్ డైఆక్సిజెనేస్) ఇన్హిబిటర్ కలుపు మందులను సమర్థవంతంగా నియంత్రిస్తుంది.

వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర - నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక ముస్లిం బడి వెనక ఉన్న ఖాళీ ప్రదేశంలో ఒక వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం ఉదయం వెలుగులోకి వచ్చింది. మృతుడు స్థానిక కొత్త వీధికి చెందిన గూడెపు మల్లేశ్వరరావు (38)గా మృతుని బంధువులు గుర్తించారు. సంఘటన విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. మృతుడు మల్లేశ్వరరావు కళాసి పని చేసేవాడని, ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారని కుటుంబ సభ్యులు తెలియ జేసారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నూతన వేతనాలను తక్షణమే అమలు చేయాలి

విశాలాంధ్ర- కూర్మన్నపాలెం: ఉక్కు కార్మికుల నూతన వేతనం తక్షణమే అమలు చేయాలని కోరుతూ ఆర్ ఎం హెచ్ పి ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమాన్ని స్టీల్ ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ధర్నా అనంతరం ఆరం హెచ్ ఓ డి పి శ్రీనివాసరావుకి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు అయోధ్యరామ్ మాట్లాడుతూ 2017 నుండి నూతన వేతనాలు చెల్లించవలసి ఉండగా 2021 అక్టోబర్ లో ఎం. ఒ. యు అయినప్పటికీ ఇప్పటివరకు విశాఖ ఉక్కులో అమలు చేయి పోవడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. గుర్తింపు యూనియన్, యాజమాన్యం కార్మి కులను మానసిక వేదనకు గురి చేస్తున్నాయని భవిష్యత్తులో తగు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఒకపక్క ఉక్కు పరిశ్రమపై ప్రైవేటు కరణ కత్తి మేడపైన వేలాడుతుండగా మరోపక్క ప్లాంట్ ను కావాలనే యాజమాన్యం నిర్వినియోగం చేసే ప్రయత్నం చేస్తుందని ఈ పద్ధతులను మార్చుకోకపోతే పోరాటాల ద్వారా యాజమాన్యతకు బుద్ధి చెబుతామని ఆయన అన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి యు రామస్వామి, యూనియన్ కార్యదర్శి డి ఎస్ వి ఎస్ శ్రీనివాసరావు, డి.వి.కె రాజు, బి అప్పారావు, కె వి సత్యనారాయణ, మరిడియ్య, నీలకంఠ రావు, యు వెంకటేశ్వర్లు, త్రిష్ట క్రెడిట్ సొసైటీ డైరెక్టర్ ఆనంద్ , ఎంవి రమణ కే శ్రీనివాసరావు, డిపార్టుమెంట్ కమిటీ నాయకులు యు. అప్పలరాజు, ఎం దానయ్య, జగన్ ఎంవి రమణయ్య పాల్గొన్నారు.

మీరు చేసింది కబ్జాలు, అక్రమాలు సొంత ఆస్తుల అభివృద్ధి....

బహిరంగ చర్చకు సిద్ధమా.. ఎంవీవీ సత్యనారాయణకు జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ సవాల్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్రంలో అత్యంత కీలకమైన నగరం, కాబోయే ఆంధ్రప్రదేశ్ రాజధాని విశాఖపట్నంకు లోక్ సభకు ప్రాతినిధ్యం వహిస్తూ ఎంవీవీ సత్యనారాయణ విశాఖకు చెప్పుకోదగ్గ ఒక్క ప్రాజెక్టును తీసుకు రాలేకపోయారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ విమర్శించారు. విశాఖ ఎంపీగా ఎంవివి చేసింది భూకబ్జాలు, అక్రమాలు, కోట్లలో అక్రమ టిడిఆర్లు పొందడం తప్ప చిరస్థాయిగా నిలిచిపోయే ఒక పని, ప్రాజెక్టు చేయలేదని అలా చేసినట్టు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. 22వ వార్డు కార్పొరేటర్ గా వార్డులో తాను చేసిన అభివృద్ధి లో సగమైనా విశాఖ లోక్ సభ పరిధిలో ఎంపీ హెదాలో ఎం వి వి చేసినట్టు నిరూపించగలరా అని సవాల్ విసిరారు. లోక్ సభ సభ్యుడనే స్థాయిని మరిచి సాటి ఎంపీ ను కుక్కలుగా పోల్చిన ఎంవివీ స్థాయి ఏమిటో విశాఖ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. విశాఖ లోక్ సభ సభ్యుడిగా ఎం వివి సత్యనారాయణ ఎంపికైన వెంటనే అత్యంత వివాదాస్పద పోతిన మల్లయ్య పాలెం ఎంవివి సిటీకి రెండువైపులా విశాలమైన రహదారులు ఏర్పడ్డాయన్నారు. విశాఖ నగరం నడిబొడ్డున చాలా రహదారులు కనీస మరమ్మత్తులు కూడా నోచుకోకపోగా నగర శివారులోని ఎంవీవీ వెంచర్ల చుట్టూ విశాలమైన తారు రోడ్ల నిర్మాణం జరిగిపోయిందన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ ఆపడం, రైల్వే జోన్ ఏర్పాట్లలో జాప్యం వంటి విషయాల్లో మీ పోరాటం ఏమిటని ప్రశ్నించారు. ఎంపీ నిధులపై శ్వేత పత్రం విడుదల చేస్తారా అన్నారు.

ఘాట్ రోడ్లో ట్రాఫిక్ జామ్

విశాలాంధ్ర - మారేడుమిల్లి: మారేడుమిల్లి - చింతూరు ఘాట్ రోడ్లో బుధవారం రాత్రి భారీ లారీ ఇంజన్లో సాంకేతిక లోపం కారణంగా రోడ్డు మధ్యలో ఇరుక్కుపోవడంతో ఇరువైపుల నుండి వచ్చే బస్సులు భారీగా నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. గురువారం అధికారులు స్పందించి భారీ లారీని పక్కకు జరిపించడంతో యధావిధిగా వాహనాలు ప్రయాణించడం జరిగింది.

విశాఖలో చర్చిల జోనల్ మీటింగ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ చర్చస్ జోనల్ మీటింగ్ గురువారం ఉదయం విశాఖ నగరంలో ఆర్చ్ బాప్టిస్ట్ చర్చిలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీ క్రిస్టియన్ మైనారిటీ కమిటీ ప్రభుత్వ సలహాదారులు ఫాదర్ ముద్దు బాలస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో సంఘమిత్ర డాక్టర్ ఆర్ఎస్ జాన్, బాప్టిస్ట్ కేజే ఫిల్ మెన్లను జోనల్ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బిషప్. ప్రకాష్, రెడ్. డేవిడ్ విక్టర్, రెడ్ విల్సన్ బాబు, ఎంఏ నాయుడు, ఎస్. జై రత్న కుమార్, డిపి ఆర్పీ కుమార్, వి కే జేమ్స్, దాని కృపానంద్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ విస్తృత పర్యటన

విశాలాంధ్ర - మాకవరపాలెం: జిల్లా కలెక్టర్ రవిపట్టన్శెట్టి మాకవరపాలెం మండలం బూరుగుపాలెంలో గురువారం విస్తృతంగా పర్యటించారు. ముందుగా ఆయన బూరుగుపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేసి అక్కడ పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్కి పలు సూచనలు చేశారు. అనంతరం అంగన్వాడీ సెంటర్ను సందర్శించారు. స్థానిక సచివాలయంను సందర్శించి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంపై నిర్లక్ష్యం వద్దని సచివాలయం కార్యదర్శి, సిబ్బందికి సూచించారు. జగనన్న సురక్ష కార్యక్రమంను సచివాలయాల ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని తహశీల్దార్ ప్రసాదరావు, ఎంపిడిఒ అరుణశ్రీకి సూచించారు. కలెక్టర్ వెంట ఎంపిపి రుత్తల సత్యనారాయణ, సర్పంచ్ ఎస్.రమణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పథకంపై సమావేశం

విశాలాంధ్ర - సీలేరు: జికెవీధి మండలం సీలేరు, దారకొండ పంచాయతీలో గురువారం జగనన్న సురక్ష పథకంపై గ్రామ సచివాలయ సిబ్బందికి, వలంటీర్లకు, వైసిపి గృహసారధులు, సచివాలయ కన్వీనర్స్, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ జె.పాపారావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా అర్హత ఉన్న ప్రతీ లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు చేయడం, దీనిలో భాగంగా వలంటీర్లు జిఎస్డబ్ల్యుఎస్ రూపొందించిన యాప్ నందు ఈ నెల 24 నుంచి 30 వరకు గ్రీవెన్స్ నమోదు చేస్తారని, ఈ గ్రీవెన్స్ను రీ సాల్వ్ చేసి అదే రోజు సర్టిఫికేట్లు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దారకొండ సర్పంచ్ నడిగొట్ల రాజు, సీలేరు సర్పంచ్ కె.వల్లిప్రసాద్, సీలేరు ఎంపిటిసి సాంబమూర్తి, సీలేరు గ్రామ సచివాలయ కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, కన్వీనర్లు పాల్గొన్నారు.

సచివాలయ సేవలు ప్రజలకు అందుబాటులో ఉండాలి

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: సచివాలయ సేవలు ప్రజలకు అందుబాటులో వుండాలని, అభివృద్ధి అనే నినాదంతో ముందుకు వెళ్లాలని సీనియర్ నాయకులు మాదిరెడ్డి సత్తిబాబు, సచివాలయ కన్వీనర్ చిక్కాల బాలకృష్ణ (బాలు) పేర్కొన్నారు. గురువారం ఎం.ఎల్.ఓ. దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో జగనన్న సచివాలయం కన్వీనర్ బొడ్డు సత్యనారాయణ అధ్యక్షతన, జగనన్న సురక్షచక్రం గురించి కార్యక్రమం రేఖపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మాట్లాడుతూ సురక్షా కార్యక్రమం ఈనెల 24 తారీకు నుండి ప్రారంభం అవుతుందని వాలంటీర్లు, ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మాచర్ల గంగయ్య, రేఖపల్లి ఎం.పి.టీ.సి. బందం విజయలక్ష్మి, మడకం కన్నారావు, చీమల కాంతారావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

3న నర్సీపట్నంలో గురు పౌర్ణమి ఉత్సవాలకు ఏర్పాట్లు

విశాలాంధ్ర - నర్సీపట్నం: జూలై 3వ తేదీన గురు పౌర్ణమి సందర్భంగా నర్సీపట్నం షిరిడి సాయి సేవా సమాజ్ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి మహోత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని నర్సీపట్నం షిరిడి సాయి సేవాసమాజ్ అధ్యక్షుడు కర్రి రామ్ గోపాల్ వెల్లడించారు. స్థానిక షిరిడి సాయి మందిరంలో ఉత్సవాల ఏర్పాట్లపై కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం సేవా సమాజ్ అధ్యక్షుడు రామ్ గోపాల్ మాట్లాడుతూ జూలై మూడవ తేదీన ఉదయం 5.15 గంటలకు కాగడా హారతి, 6.00 గంటలకు నిత్య పూజ, నిత్య హెూమం, 9.00 గంటలకు అభిషేకములు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. పూజా కార్యక్రమాల అనంతరం భారీ ఎత్తున 5000 మంది పేదలకు భక్తులకు అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో సేవా సమాజ్ కార్యదర్శి వి రామచంద్ర రాజు, ట్రెజరర్ లంక ఈశ్వరరావు, సభ్యులు పోతుల సత్తిబాబు, పివి రమణారావు, మంతిన రమణారావు,లాలం చిన అప్పారావు, మోటూరి లోవరాజు, బాబ్జి, ఆలయ ప్రధాన అర్చకులు ఎం రాజేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం

విశాలాంధ్ర - కొయ్యూరు: రైతును రాజు చేయాలనే లక్ష్యంతోనే వైసీపీ ప్రభుత్వం పని చేస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. కొయ్యూరు మండలంలో ప్రధానమంత్రి కృషి సించాయీ యోజనలో భాగంగా మొదటి దశ వాటర్ షెడ్ కార్యక్రమాన్ని పాడేరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ తో కలిసి ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ప్రారంభించారు. పథకంలో భాగంగా ముందుగా 90 శాతం రాయితీపై గిరిజన రైతులకు ప్రభుత్వం సరఫరా చేసిన వ్యవసాయ యంత్ర పరికరాలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో కొయ్యూరు మంప రేవళ్ళ రావణాపల్లి మర్రివాడ పంచాయతీల్లో వాటర్ షెడ్ మొదటి దశ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో భాగంగా రైతులు పంటలు సాగు చేసేందుకు నీటిని నిల్వ చేసుకోవడానికి వీలుగా చెరువులు మరమ్మత్తులు చేసుకోవడం భూగర్భ జలాలను సంరక్షించడం వంటి కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. వాటర్ షెడ్ పథకానికి ప్రభుత్వం 11 కోట్ల నిధులను విడుదల చేసిందని ప్రాజెక్టు కాలవ్యవధి 5 ఏళ్ళు ఉంటుందని తెలిపారు. పథకంలో భాగంగా 1.65 కోట్ల విలువైన తార్పాలిన్లు, కట్టర్లు వాటర్ మోటర్లు స్ప్రేలు తదితర పరికరాలను 90 శాతం సబ్సిడీపై అందిస్తున్నట్లు తెలిపారు. గిరిజన రైతులకు ఉండే సౌకర్యాలు మైదాన ప్రాంత రైతులకు ఉండవని ప్రభుత్వం అందించే సౌకర్యాలను రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమానికి కృషి చేస్తున్నాయని ఇటీవల ఐటిడిఎ ద్వారా రైతులకు ట్రాక్టర్లు అందించడం జరిగిందన్నారు. కొయ్యూరు మండలానికి 1100 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమని ప్రభుత్వానికి నివేదించడం జరిగిందని ఇప్పటికే 850 క్వింటాళ్ల విత్తనాలు సరఫరా చేయడం జరిగింది అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పొలం పనులు ప్రారంభమయ్యే నాటికి విత్తనాలు కొయ్యూరు మండలంలో భారీ ఎత్తున తీసుకు రావడం జరిగిందని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమేష్ జడ్పిటిసి నూకరాజు ఏఎంసి చైర్ పర్సన్ రాజులమ్మ వైస్ ఎంపీపీలు వెంకటరమణ నూకాలమ్మ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నాగమణి పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పూర్ణానంద స్వామిని ఆశ్రమ బహిష్కరణ చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: బాలికపై లైంగిక దాడి కేసులో రిమాండ్కి వెళ్ళిన పూర్ణానంద స్వామిని ఆశ్రమం నుంచి తక్షణమే బహిష్కరించాలని కొత్త వెంకోజీపాలెం గ్రామ సేవా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సంఘం కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడారు. 80 ఏళ్ల చరిత్ర కలిగిన జ్ఞానానంద ఆశ్రమం ప్రతిష్ట దెబ్బతినేలా వ్యవరించడం దురదృష్టకరం అన్నారు. ఇతను 2012లో కూడా ఇలాంటి కేసులో నిందితుడుగా వున్నాడని గుర్తు చేశారు. గతంలో ఇక్కడ భగవద్ గీత పారాయణం లో తమ గ్రామం ప్రజలు పాల్గొనే వారు అన్నారు. ఇద్దరు దాతలు ఆరు ఎకరాల భూమి దానం గా ఇచ్చిన ఈ స్థలంలో ఆశ్రమం, మూడు దేవాలయాలు నిర్మించామని అన్నారు. కానీ, దాతల సాయం తో పిల్లల ఆశ్రమం, గోశాల నిర్వహిస్తున్న స్వామీ తమ గ్రామస్థులతో గొడవలు పడి కేసులు వేస్తూ వేధిస్తున్నాడు అని ఆందోళన వ్యక్తం చేశారు. దాతలులో ఒకరైన పీలా అప్పారావు కుమారులు భూములు వెనక్కి ఇవ్వాలని ఒత్తిడి చేశారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో స్వామి వీరికి అమ్మేసిన స్థలంలో చెక్కల దుకాణాలకు అద్దె లకు ఇచ్చారని అన్నారు. అలాగే స్మశానం పక్కన స్థలాలు ఆక్రమించి, ఎంవీవీ, పీలా హెూమ్స్ అపార్ట్మెంట్లు నిర్మించారు అన్నారు. మీడియా సమావేశంలో గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు మద్దాల వీర వెంకట అప్పారావు, మాజీ అధ్యక్షులు కాళ్ల బాబురావు, కాళ్ల వరహాలు, దాడి పరదేశి రావు మాట్లాడారు. సమావేశంలో సంఘం నాయకులు కూడా పాల్గొన్నారు.

గిరిజనుల మరణఘోష ప్రభుత్వానికి అధికారులకు పట్టదా...?

గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

విశాలాంధ్ర - కొయ్యూరు: అల్లూరి జిల్లాలో మారుమూల గ్రామాలకు సరైన రహదారి రవాణా సదుపాయం లేక అత్యవసర సమయాల్లో గిరిజనులకు వైద్య సేవలు అందకపోవడంతో ఇటీవల అనేకమంది మృతి చెందారని అయినా ప్రభుత్వానికి గిరిజనుల మరణఘోష పట్టడం లేదని గిరిజనసంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు ఆరోపించారు.

అల్లూరి సీతరామరాజు జిల్లా కొయ్యూరు మండలం లోతట్టు ప్రాంతమైన కుంబుర్ల గ్రామానికి చెందిన పాంగి రోజా (20) అనే నిండు గర్భిణీ పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబీకులు ఆసుపత్రికి తరలిస్తుండగా మంగళవారం సాయంత్రం పరిస్థితి విషమించి మార్గమధ్యలో ఆకస్మికంగా మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. మారుమూల గిరిజన గ్రామం నుంచి డౌనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 8 కిలోమీటర్ల దూరం ఉండడం సరైన రోడ్డు సదుపాయం లేక ఆమెను ఆశా కార్యకర్త కొర్ర శాంతితో కలిసి స్ట్రెచ్చర్ మీద మోసుకువస్తుండగా మార్గ మధ్యలో ఆమె మృతి చెందిందని పేర్కొన్నారు. ఈనేపథ్యంలో కుటుంబ సభ్యులు విలపించిన తీరు చూపరులను కలిచివేసిందన్నారు. గిరిజన ప్రాంత అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వం, వైసీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు గొప్పలు చెప్పుకున్నప్పటికీ ఆచరణలో ఎక్కడ అమలు కాలేదని విమర్శించారు.

ఏజెన్సీలో విద్యా, వైద్యం, రహదారులు, తాగునీరు విద్యుత్ వంటి మౌలిక వసతులు ఇంకా అనేక గ్రామాలలో లేని పరిస్థితి నెలకొందన్నారు. పిహెచ్సిలో సరైన పరికరాలు వైద్య సిబ్బంది కొరత, మందులు కొరత వంటి సమస్యలు పట్టి పీడిస్తున్నాయని వాటిని పట్టించుకునే నాథుడు కరువయ్యాడని విమర్శించారు. తరచూ మారుమూల గ్రామాలలో సకాలంలో వైద్యసహాయం అందక గిరిజనులు మృత్యువాత పడుతున్న సంఘటన అనేకం చోటు చేసుకుంటున్న ప్రభుత్వానికి చీమకుట్టినట్టైనా లేదని పథకాలకు ఇచ్చే ప్రాధాన్యత గిరిజన ప్రాంతంలో రహదారులకు కూడా ఇచ్చి ఉంటే ఇన్ని ప్రాణాలు పోయిండేవి కావని తెలిపారు. వైసిపి ప్రభుత్వం నాలుగు సంవత్సరాలలో కొత్తగా ఒక్క రహదారి కూడా పూర్తిస్థాయిలో నిర్మించలేదని విమర్శించారు. ఇవి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా, ప్రజాప్రతినిధులు, అధికారులు మారిన గిరిజనల తలరాత మారడం లేదని పేర్కొన్నారు. సకాలంలో వైద్య సేవలు అందక మృతి చెందిన గర్భిణి రోజా కుటుంబానికి ప్రభుత్వం 10 లక్షల ఎక్షగ్రేషియా చెల్లించాలని, మారుమూల గ్రామాలకు రహదారులు రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.